క్లుప్తంగా

ఉపాధితోనే మహిళలకు ఆర్థిక స్వావలంబన



సర్టిఫికెట్లు అందుకున్న మహిళలు

తుర్కయంజాల్: స్వయం ఉపాధితోనే మహిళలకు ఆర్థిక స్వావలంబన సాధ్యమని ఎయిర్ వాటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ ప్లాంట్ ప్రతినిధి జయరామన్ అన్నారు. గురువారం టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసుకున్న 40 మంది మహిళలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో షైన్ సంస్థ ప్రధాన కార్యదర్శి పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాలాజీసింగ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి



యాదయ్య

తలకొండపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థుల విజయంలో కీలక పాత్ర పోషించిన పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్‌కు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు కాంగ్రెస్ సీనియర్ నేత దాసరి యాదయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు బాలాజీసింగ్ ప్రత్యేక తెలంగాణ కోసం కల్వకుర్తి నియోజకవర్గంలో గ్రామగ్రామాన తిరిగి ఉద్యమాన్ని ఉధృతం చేశారని గుర్తుచేశారు. బాలాజీసింగ్‌ను ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలని, రాష్ట్ర నాయకత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాలని కోరారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న సర్పంచ్, ఈఓ, ఆలయ కమిటీ సిబ్బంది

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. గురువారం సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, ఆలయ ఈఓ స్నేహలత, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆదాయం రూ. 48,177 వచ్చినట్లు ఈఓ స్నేహలత తెలిపారు. కార్యక్రమంలో ఈఓ స్నేహలత, సీనియర్ అసిస్టెంట్ రవి, క్లర్క్ ఆంజనేయులు, సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు దేవేందర్‌రెడ్డి, చంద్రయ్య, మాజీ సర్పంచ్ మణెమ్మ, యాదయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, యాదయ్య, ఆలయ మాజీ కమిటీ చైర్మన్ శ్రీశైలం యాదవ్, హరిమోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రవణ్ పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు



ఆలయంలో తిరుప్పావై ప్రబంధ విన్నపంలో పాల్గొన్న భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వేంకటగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ధనుర్మాస ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. ప్రతి ఏడాది నెలరోజుల పాటు ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. గురువారం ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో గోదా రంగనాద తులసిదళ అర్చన, తిరుప్పావై ప్రబంధ విన్నపం, నక్షత్రహారతి నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులతో పాటు నాయకులు పాల్గొన్నారు.

వనస్థలిపురం సీఐ జలేందర్‌రెడ్డి బదిలీ



హస్తినాపురం: ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని వనస్థలిపురం పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న దేప జలేందర్‌రెడ్డిని మల్టీజోన్-2కు బదిలీ అయ్యారు. బుధవారం హైదరాబాద్ మల్టీజోన్-2 ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఇచ్చిన బదిలీ ఉత్తర్వుల మేరకు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వనస్థలిపురం సీఐ జలేందర్‌రెడ్డితో పాటు మరో ముగ్గురు సీఐలను రిలీవ్ చేసినట్లు తెలిసింది. వనస్థలిపురం సీఐగా గతేడాది మార్చి 31న బాధ్యతలు చేపట్టిన జలేందర్ రెడ్డి తొమ్మిది నెలలకే బదిలీ కావడం విశేషం.

వెలుగులు నింపేందుకే ‘ప్రజాపాలన’

- అర్హులందరికీ గ్యారంటీలు
- అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ పాలన
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కడ్తాల్: అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందజేస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే రాష్ట్ర ప్రభుత్వం ‘ప్రజాపాలన’ అభయహస్తం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామన్నారు. మహాలక్ష్మి పథకం, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పార్టీలకతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌లు ఎల్‌ఎన్‌రెడ్డి, తులసీరాం, ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీఓ మధుసూధనాచారి, ఎఓ శ్రీలత, సీఐ శివప్రసాద్, నాయకులు భాస్కర్ రెడ్డి, వేణుగోపాల్, రాంచందర్, చందోజీ, జహంగీర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేశవరెడ్డి గార్డెన్‌లో కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాలకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న కసిరెడ్డి, నాయకులు

ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ పాలన అందిస్తామని అన్నారు. ఆరు గ్యారంటీ పథకాలతో పాటు, డిక్లరేషన్‌లు అమలు చేస్తామని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడం ఖాయమని అన్నారు.

ఆరోగ్యకర సమాజానికి క్రీడలు దోహదం

- సీఐ శివప్రసాద్



కడ్తాల్: వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సీఐ శివప్రసాద్

కడ్తాల్: ఆరోగ్యకర సమాజానికి క్రీడలు దోహదపడుతాయని సీఐ శివప్రసాద్ అన్నారు. యువజన సంఘాల ఐక్యవేదిక- వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను గురువారం ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్‌తో కలిసి సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు చదువుతో పాటు, క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులకు స్వచ్ఛంద సంస్థలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రోత్సాహించి, ప్రతిభను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, తెలంగాణ ఉద్యమ నాయకుడు వెంకటేశ్, వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు మాధవులు, అంబేడ్కర్ యువజన సంఘాల మండల అధ్యక్షుడు దాసు, నాయకులు చెన్నయ్య, కుమార్, మురళి, అంజి, వేణు, మధు, నరేశ్, అనిల్‌గౌడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

- జెడ్పీటీసీ వెంకటేశ్



ఆర్థిక సాయం అందజేస్తున్న అశోక్‌గౌడ్ తదితరులు

తలకొండపల్లి: శిథిలమైన ఆలయాల మరమ్మతులతో పాటు నూతన ఆలయాల నిర్మాణం కోసం తోడ్పాటు అందిస్తానని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని దాస్య తండాలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. ఆలయ నిర్మాణానికి సాయం అందించాలని తండావాసులు జెడ్పీటీసీని కోరారు. గురువారం ట్రస్ట్ సభ్యులు, గౌడసంఘం కల్వకుర్తి తాలుక అసెంబ్లీ కన్వీనర్ మొక్కురాల అశోక్‌గౌడ్ ద్వారా రూ.లక్ష తండావాసులకు జెడ్పీటీసీ అందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సక్రునాయక్, ద్రశు నాయక్, అశోక్‌గౌడ్, బక్కనాయక్, గోపాల్‌నాయక్, భీమానాయక్, సక్రియానాయక్, రమేశ్‌నాయక్, రవి, వినోద్, భాస్కర్, పాండు, చంద్రయ్య, బిల్యా, శంకర్, అశోక్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల శోభాయాత్ర



దండుమైలారంలో అయోధ్య రాముని అంక్షితల శోభాయాత్ర



అక్షింతల వితరణ కార్యక్రమంలో పాల్గొన్న రమేశ్ తదితరులు

ఇబ్రహీంపట్నం: అయోధ్య రామ మందిరం నుంచి తెచ్చిన శ్రీరాముని అక్షింతల శోభాయాత్రను దండుమైలారం గ్రామంలో గురువారం నిర్వహించారు. శ్రీరాముని అక్షింతలను ప్రజలు దర్శించుకున్నారు. జైశ్రీరామ్, జైజై శ్రీరామ్ అంటూ నినాదాలు, భజనలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిధర్, గ్రామ సర్పంచ్ రావణమోని మల్లీశ్వరి జంగయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శ్రీశైలం, శ్లోక స్కూల్ చైర్మన్ బిట్ల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు హరినారాయణ, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మంగ ఐలేశ్‌తోపాటు గ్రామస్తులు రమేశ్, భంగిని మఠం నీలకంఠప్ప, సాయికుమార్‌చారి, గుండ్ల శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, పట్నం శ్రీశైలం, అయ్యప్ప రెడ్డి, చింతల కృష్ణ, లింగస్వామి, శివకుమార్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

తుర్కయంజాల్: అయోధ్యలో శ్రీరాముడి ఆలయం త్వరలో ప్రారంభం కానుండటంతో ప్రజల నుంచి విశేష స్పందన కనిపిస్తోందని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రమేశ్ అన్నారు. గురువారం తుర్కయంజాల్‌లో ఆయన అక్షింతల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తూళ్ల వసంత, మారగోని సునీత, మంగ విమల, లక్ష్మి, వనజ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కందుకూరు: మండల పరిధిలోని కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 6వ తేదీన (శనివారం) ఎమ్మెల్యే సబితారెడ్డి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ గోపాల్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉ.10.30 గంటలకు మండల పరిషత్ సమావేశపు హాల్‌లో కార్యక్రమం జరగనుందన్నారు. లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

మహేశ్వరం ప్రజలకు రుణపడి ఉంటా



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన మహేశ్వరం నియోజకవర్గం ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని షాహీన్‌నగర్‌లో గురువారం ఆమె 77 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాటు విజయవంతంగా ఈ పథకాన్ని అమలు చేశారన్నారు. తనపై పూర్తి విశ్వాసం ఉంచి గెలిపించిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇకపై మరింత బాధ్యతాయుతంగా పని చేస్తానన్నారు. చెక్కులు గతంలోనే మంజూరయ్యినప్పటికీ.. ఎన్నికల కోడ్ కారణంగా అందించలేకపోయామని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా కల్యాణలక్ష్మి పథకానికి తులం బంగారాన్ని కలిపి ఇవ్వాలన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



రామ్‌రెడ్డిని సన్మానిస్తున్న గురుస్వామి శివసాయి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహించి, ఇరుముడితో శబరిమలకు స్వాములు బయలుదేరారు. శివసాయి గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి పూజలు, భజనలతో ఈ ప్రాంతమంతా మార్మోగింది. అయ్యప్ప స్వాములు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ పట్వారి జైన్ రామ్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రామ్‌రెడ్డిని ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

పెద్దూర్ తండాలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని పెద్దూర్ తండాలో గురువారం అయ్యప్ప స్వాములు పడి, మెట్లు, ఇనుముడి పూజలు ఘనంగా నిర్వహించారు. ఇనుముడి కట్టు అంటూ అయ్యప్ప నామ కీర్తనలు ఆలపించారు. ప్రాంగణమంతా అయ్యప్ప నామ స్మరణతో మార్మోగింది. కన్నుల పండువగా కొనసాగిన ఈ కార్యక్రమానికి అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీశైలం, సక్రి, కిషన్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, శ్రీను, భిక్షపతి, పణీందర్, రమేశ్, అభిషేక్, అయ్యప్ప భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాలకు అండగా ఉంటాం



నగదు అందజేస్తున్న విఠల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: సహకార సంఘం పరిధిలోని రైతు కుటుంబాలకు అండగా ఉంటామని ఆ సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన బాటసింగారం రైతుసేవా సహకార సంఘం సభ్యురాలు భీరగోని శంకరమ్మ డిసెంబర్ 6న మృతి చెందారు. సహకార సంఘం తరఫున మృతురాలి భర్త రంగయ్యకు గురువారం రూ.25వేల ఆర్థిక సాయాన్ని విఠల్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రాములు, మహిపాల్‌రెడ్డి, అబ్దుల్లాపూర్ సర్పంచ్ కిరణ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి



విద్యార్థులతో నిత్యారెడ్డి తదితరులు

మంచాల: విద్యార్థులు కష్టపడి చదువుకొని మంచి మార్కులు సాధించాలని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు నిత్యారెడ్డి అన్నారు. గురువారం మంచాల మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిత్యారెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఆర్ టీం సభ్యులు ఓరిగంటి మహేష్‌గౌడ్, ధన్‌రాజ్, శివ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ మాధవరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అభయ హస్తానికి ఆదరణ

- జెడ్పీటీసీ మహిపాల్
- కొనసాగుతున్న గ్రామ సభలు
- వెల్లువలా దరఖాస్తులు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ మహిపాల్



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు, నాయకులు

ఇబ్రహీంపట్నం: ప్రజల వద్దకు పాలనను తీసుకురావాలనే లక్ష్యంతో ప్రజాపాలన కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జెడ్పీటీసీ మహిపాల్ తెలిపారు. ప్రజాపాలన అభయహస్తం కార్యక్రమానికి ఆదరణ పెరుగుతోందన్నారు. ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి చేయూత పథకాలకు లబ్ధిదారుల దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, సర్పంచ్ యాదగిరి, ఎంపీడీఓ వెంకటమ్మ, మండల పీఆర్ ఏఈ ఇంద్రసేనారెడ్డి, గ్రామ కార్యదర్శి సాయికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆమనగల్లు మండలంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలో ప్రజాపాలన గ్రామసభలు కొనసాగుతున్నాయి. గురువారం మండల పరిధిలోని పోలెపల్లి, కొత్తకుంటతాండా, మాలెపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. పోలెపల్లిలో 93, కొత్తకుంటతాండలో 50, మాలెపల్లి గ్రామంలో 98 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ పారూక్ హుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు బాల్‌రాం, శోభ, శ్రీనయ్య, పోలెపల్లి ఉపసర్పంచ్ అంజన్‌రెడ్డి, ఎంపీఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వార్డు సభలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు. ఆయా వార్డు సభల్లో కాంగ్రెస్ నాయకులు ఫరీద్, రఫి దరఖాస్తులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పేదల కోసమే ‘ప్రజాపాలన’

మంచాల: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసమే ప్రజాపాలన కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు నిత్యారెడ్డి అన్నారు. గురువారం మంచాల మండల పరిధిలోని జాపాల, రంగాపూర్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిత్యారెడ్డి మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. అర్హులకు రేషన్ కార్డులు, ఇళ్లు ఇవ్వలేదన్నారు. ఇష్టానుసారం నిత్యావసరాల ధరలు పెంచి ప్రజలపై భారం మోపిందని మండిపడ్డారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్‌లు నాహిదా బేగం, మమత, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ మల్లప్ప వార్డు సభ్యులు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోండి

తలకొండపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీకాంత్ కోరారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలకు అర్హులైన లబ్ధిదారులందరూ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మండల పరిధిలోని హర్యానాయక్ తండా, తుమ్మలకుంట తండాల్లో గురువారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. మండలంలో 12,365 గృహాలు ఉండగా, ఇప్పటి వరకు 11,445 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగారెడ్డి, ఎంపీఓ రఘు, ఏఓ రాజు, ఏపీఓ కృష్ణ, సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, గోపాల్‌నాయక్, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఫారాలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

కొనసాగుతున్న ప్రజాపాలన

మాడ్గుల: ప్రజాపాలన కార్యక్రమంలో అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జర్పులతండా సర్పంచ్ హీరాదేవి జైపాల్‌నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘువులు, మండల ఎస్టీ సెల్ నాయకుడు విజయ్, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న గడువు

ఇబ్రహీంపట్నం: గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలకు శనివారంతో గడువు ముగియనున్నట్లు స్థానిక నల్లకంచె గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లీలావతి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో చేరేందుకు 2023-24 విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశపరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. మరింత సమచారం కోసం గురుకుల వెబ్‌సైట్, టోల్ ఫ్రీ నంబర్ 18004254 5678 సంప్రదించాలన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

యాచారం: మండల పరిధిలోని నల్లవెల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం నోటు పుస్తకాలు అందజేశారు. మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు తన తల్లి రాచర్ల ఈశ్వరమ్మ జ్ఞాపకార్థం పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. భవిష్యత్తులో కూడ పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయం చేస్తానని అన్నారు. పాఠశాల స్థాయి నుంచే కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నల్లవెల్లి ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్, నాయకులు కానమోని జంగయ్య, కొండల్, వెంకటయ్య, హరికృష్ణ, పాఠశాల హెచ్ఎం శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.